వెంకన్న

'కరుణకుమార'



"బేరగాళ్లు ఎద్దుపగ్గంపట్టుకొని బిరబిర లాక్కొనిపోయారు."

౧

"అయ్యా! రాగయ్యా! శిస్తుపైకం యిప్పించుకొని రమ్మన్నాడయ్యా, రెడ్డి" అని ఉదయం తెల్లవారేవరకు యమకింకరుల్లాగ ఇద్దరు వెట్టివాండ్లు వచ్చి వాకిట నిలబడ్డారు.

రాగయ్య డెబ్బదేండ్లతొక్క. ఇంకా నిద్రమంచంమీదనుంచి లేవనేలేదు.

"ఈ రెండురోజులూ నిదానించండ్రా: పిల్లవాడు ఊరునుంచి వచ్చి, కరణంకాడ లెక్క చూచుకొని పైకం కట్టేస్తాడు" అని మంచంమీద కూచునే, వణికే కంఠంతో సమాధానం చెప్పాడు రాగయ్య. "రెడ్డి ఒప్పుకోవడం లేదయ్యా! ఇయ్యాల ముడుపు ఇరసాలుఅయి తీరాలె, ఇంక నిలపడానికి లేదంటున్నారు మునసబూ, కరణమూను. పైకం యివ్వకుంటే ఎద్దునిపట్టుకొని రమ్మన్నాడు రెడ్డి" అని వెట్టివాళ్లు ఇద్దరూ చెరొకకర్ర చేతపట్టుకొని, వాకిట్లో నిలబడ్డారు.

'ఎద్దుని జప్తిచేసి తీసుకొనిరమ్మన్నాడు రెడ్డి' అనేమాటలు రాగయ్య చెవిలో పడేవరకు అతనిమనస్సు కలుక్కుమన్నది. అతనికి డెబ్భైయేళ్లు వచ్చినవి. ఇంతవరకెన్నడూ అటువంటి చిన్నతనంమాట అతడనిపించుకొనియుండలేదు. సర్కారుకు వెయ్యా, పదిహేనువందలూ శిస్తుకట్టే మహామహా పెద్దపెద్దరెడ్లందరికంటె కూడా-చిన్నకాపు అయినా తాను ఒకరిచేత అడిగించుకోవలసిన అవసరం లేకుండా, ఏవాయిదా శిస్తు ఆవాయిదాలో ముందుగానే మునసబుకు చెల్లించి రసీదు తెచ్చుకొనే - బాధ్యత తెలిసిన కాపు అతడు. తనహయాంలో తాను ఒకరికి చెప్పినవాడే కాని ఒకరిచేత చెప్పించుకొన్నవాడు కాడు. కాని ఈ నాటికి చిక్కుపడవలసి వచ్చింది. మునసబు పంపిన ఒక వెట్టివాడిచేత ఈకాలా

నికి తా నావిధంగా అడిగించుకోవలసి వచ్చింది! పైగా ఎద్దును పట్టుకొని రమ్మన్నాడు రెడ్డి! పోగామిగిలిన ఐశ్వర్యంలో తనవద్ద ఉన్నది— ఇంట బుట్టి పెరిగిన ఈ ఎద్దు ఒక్కటే! ఆఎద్దుజత కాక దున్నపోతు నాధారం చేసుకొని, ఆనాలుగెకరాల కయ్యా ఎట్లాగో సాగు చేసుకొంటున్నాడు రాగయ్య. తన ఏకైకపుత్రుడు రమణయ్యతో సమానంగా పెంచుకొన్న ఎద్దు అది. దాన్నే జప్తిచేయాలని తలపెట్టాడు రెడ్డి. ఔరా దుర్దినం! అనుకొన్నాడు రాగయ్య.

అతని కళ్లవెంబడి గిర్రున తిరిగినై నీళ్లు. దొడ్లో గాటకట్టివేసిన ఎద్దు కళ్లల్లో మెదిలింది. ఇంత బ్రతుకు బ్రతికి, బంగారంవంటి ఎద్దును పదిమందిలోనూ జప్తి చేయించుకొంటాడా తాను? అంతకంటె తనశిరస్సు నేల బడిపోవడం మేలుకదూ! అంతకంటె ఆఎద్దును ఏ కసాయివాడికైనా అయినకాడికి తెగనమ్మి సర్కారుశిస్తు సర్కారువారి మొఖాన్న కొట్టడం మేలుకదూ!

రోషం పుట్టేవరకు రాగయ్యకు కళ్లెర్రనైనవి. కనురెప్పలమీద జారిపడ్డ తెల్లని కనుబొమ్మలు పైకెత్తేడు. ముడతలుపడ్డ మొఖంలో ప్రజ్వలించే ఆరెండు నేత్రాల్లోనూ మిగిలిఉన్న రెండుచుక్కలు కింద రాలినై. కనుబొమ్మ లెత్తేవరకు నుదుటిమీద తాచుపాము పిల్లల్లాగ మూడుముడతలూ పైకి ఉబికినై.

"ఒకే! పదిగంటలకు పైకం పంపుతానని రెడ్డితో చెప్పండి. అప్పటికి పైకం చేరకుంటే—అట్లనే మీ ఇష్టప్రకారం ఎద్దును తీసుకొనిపోవచ్చును. నేను చెప్పానని రెడ్డితో చెప్పం"డన్నాడు రాగయ్య.

వెట్టివాళ్లు వెళ్లిపోయారు.

"ఏందయ్యా! ఎద్దుని తీసుకొనిపొమ్మంటున్నావు?" అని లోపల కుండలుకడిగే భార్య లక్ష్మమ్మ ఈ మాటలు విని, బయటికి వచ్చి భర్త నడిగింది. "సర్కారుకు చెల్లించవలసిన శిస్తు చెల్లించకపోతే అధికార్లు ఊరుకుంటారా? శిస్తు కట్తావా, ఎద్దుని జప్తి చేయమంటావా అని మునసబు కబురు చేశాడు"అని చెప్పాడు రాగయ్య.

"అయ్యో! ఇదేం పోయేకాలమయ్యా! సర్కారుశిస్తు కట్టకుండా ఎగవేస్తా మనుకొన్నాడా రెడ్డి! అందరూ తనకిమల్లె కలిగినవాళ్లే ఉంటారా లోకంలో? ఒకరోజు ముందూ వెనకా ఉండొద్దా ఎంతవాడికైనా?" అని బుగ్గలు నొక్కుకొని నిలబడింది లక్ష్మమ్మ.

"మునసబుతప్పేముంది? వాళ్ల డ్యూటీప్రకారం వాళ్లుఅడగడం న్యాయమే" అన్నాడు రాగయ్య.

"అందుకని, సాటి కాపువాడయి కూడా, వాకిట వెట్టివాళ్ల చేత ఎద్దుని జప్తీచేయించడానికి సిద్ధమవుతాడా? ఈయేడు గిద్దెడుగింజలుకూడా ఆపొలం మీద కళ్లచూడినపాపాన్ని పోలేదే! శిస్తు ఎట్లా కట్తా మనుకొన్నాడా మునసబు?"

"మనరోదన అరణ్యరోదన. ఎందుకు నువ్వ ఆయాసపడుతావు? ఏదితప్పినా సర్కారుడుపు తప్పుతుందా మరి?"

"నువ్వ మొదటినుంచీ ఇట్లాంటినీతులు చెప్పే సంసారం ఇంతకాడికి తెచ్చేవు. నువ్వ శిస్తూ కట్టొద్దు, ముడుపూ కట్టొద్దు. ఊరుకో! పల్లెలికి పోయిన పిల్లోడు రానీ! కరణంకాడికి పోయి లెఖ్ఖాడొక్కా చూచుకొని కట్టవలసిఉంటే వాడే కట్టి రసీదు తెచ్చుకొంటాడు."

"అయ్యా వచ్చేదాకా అమావాస్య నిలుస్తుందటే పిచ్చిదానా? సర్కారుకు మనసులాజా ఏమీ ఉండదనుకో!"

"అయితే నీమనసొచ్చినట్లు చేసుకో" అని విసుక్కొంటూ లోపలికి పోయింది లక్ష్మమ్మ.

గ్రామమునసబు అక్రమంగా తన పెనిమిటిదగ్గర డబ్బు గుంజుకొంటున్నాడేమోనన్న ఆక్రోశంకొద్దీ మాట్లాడవలసి మాట్లాడిందికాని భర్తమాట కెన్నడూ ఎదురాడేది కాదు ఆ భాగ్యశాలి. భర్తమీదనే ఆజవాబ్దారీ పెట్టి, తా నింట్లోకి వెళ్లిపోయింది.

౨

అప్పటికప్పుడే వారంరోజులకిందట ఎద్దుల బేరగాళ్లు పడమటినుంచి వచ్చి ఆ గ్రామంలో దిగి ఉన్నారు.

రాగయ్యకొడుకు రమణారెడ్డి పొగాకుబేరం మీద ఏటిఅవతల పల్లెల్లోకి పోయి పదిరోజు లయింది. అత డెప్పుడు వస్తాడో! వారానికల్లా తిరిగివస్తానని నమ్మకం చెప్పిపోయిన కొడుకు ఇంకా ఇంటికిరాలేదు. అతడు వచ్చేదాకా సర్కారుశిస్తు నిలుస్తుందా? నిలవకపోతే, పైకం ఎక్కణ్ణుంచి తీసుకొనిరాగలడు రాగయ్య? పదిగంటలకు పైకం చెల్లిస్తానని గ్రామమునసబుకి ఖండితంగా చెప్పిపంపాడు. ఆమాట పొరపాటయితే, ఎద్దుని జప్తీచేయకమానడు మునసబు. ఈసారి తాను మూడోవాయిదా పైకంకూడా చెల్లించలేనని చెప్పితే, ఇంతవరకూ గ్రామమునసబు తనని ఒత్తిడిచేయకుండా నిలుపుకొని వచ్చాడు. కాని, ఇది ఆఖరువాయిదా! ఇక శిస్తు నిలపడానికి వీల్లేదని రాగయ్యకి తెలుసు. రెండువాయిదాల శిస్తూ, కరణానికివ్వవలసిన జమాబందీ మామూలూ వగైరాలన్నీ కలిసి ఇరవై రూపాయలదాకా చెల్లించవలసి ఉంటుందని కరణం యిదివరకే చెప్పాడు. ఇంట్లో కూటికే చాలీచాలకుండా ఉన్నవి ఈ యేడు పొలంలో పండిన గింజలు. ఏవస్తు వయినా కుదువపెట్టి తెద్దామనుకొంటే, భార్యమెడలో తాళిబొట్టు తప్ప మరొకటి ఏమీ లేదు. పిల్లవాడుగనక ఉంటే ఏమారాజునో అడిగి తీసుకొని వచ్చేవాడు. తాను ముసలివాడు. ఒకరిదగ్గరకు పోయి చేబదు లడగడానికి అభిమానం. అక్కడికీ, షాహుకారివద్దకు పోయి ఒకపాతిక రూపాయలు ప్రోనోటుమీద బదులడిగాడు. కాని, మేజరు అయిన కొడుకూ తనూ ఇద్దరూకూడా చేరి ప్రోనోటు రాసియిస్తే రూపాయివడ్డీకి ఇస్తానన్నా డతడు; కాని హాజరులో తనకొడు కేడీ?

శిస్తుపైకం తాను సర్దుబాటు చేయగల ఉపాయం అతని కేమీ తోచలేదు. అట్టే ఆలోచించాడు. పోనీ, ఎద్దుజతకి కట్టే దున్నపోతును అమ్మివేద్దామని ఆలోచన పుట్టింది. కాని దానిమీద ఏడెనిమిది రూపాయలకంటె జాస్తిగా రాదే! పదిహేను ఇరవైరోజుల నుండీ ఈ సందుకట్లు పిల్లవాడు ఇంటిపొరుగున ఉండడమే లేదు. అందువల్ల పశువులకు సరిగా మేత అమరక, అవి చిక్కి శల్యమైపోయాయి. ఆదున్నపోతు అమ్మబోతే అడివీ, కొనబోతే కొరివీగా ఉన్నది. ఇక ఎటువచ్చీ ఎద్దు ఒకటి ఉన్నది. దాన్ని అమ్మితే అప్పటిధరల్లో ఏనల భయ్యో, ఏభయ్యో ఇస్తారు. అదిగాక అవసరంకొద్దీ కావలెనని అమ్మజూపితే, రూపాయిసొమ్ము అర్ధరూపాయికి అడుగుతారు బేరగాళ్లు. తాను శిస్తు కట్టకుంటే మునసబు ఎటు తిరిగీ ఆయెద్దును జప్తిచేసితీరుతాడు. తన ఇంట్లో అప్పటి కాయెద్దుతప్ప, విలువగల మరొకచరాస్తి ఏమిన్నీ లేదు. ఎద్దును జప్తిచేసి తీసుకొనిపోతే తా నేంచేయగలడు? దాన్ని అయినకాడికి వేలంలో అమ్మివేస్తే తా నేంచేయగలడు? తనకంఠంలో ప్రాణం ఉండగా, వెట్టివాడు తన ఆవరణలో ప్రవేశించి ఎద్దును పట్టుకొనిపోతూఉంటే తాను చూస్తూ ఊరుకోవడం ఎల్లాగ? అంతకంటె, పోతే పోయింది ఎద్దు, దాన్ని గుట్టుగా అమ్మివేసి సర్కారుశిస్తు సర్కారువారి మొఖాన్నకొట్టడం తనకు గౌరవంకదా! తన హయాంలో సంపాదించిన ఆస్తి ఎంత ఖర్చయిపోయింది కాదు? తన తండ్రి యిచ్చిన భూములూ, పశువులూ ఎన్ని నష్టమైపోయినవికాదు? ఇంట పుట్టిన ఎద్దని దీనిమీద మమకారంగాని, లేకపోతే ఈ ఎద్దు ఉండి తనని రక్షిస్తుందా? తన ఐశ్వర్యం అంతా ఎట్లాపోయిందో ఇదికూడా అట్లనే పోయిం దనుకొంటాను— అని ఈవిధంగా పనిచేయడం మొదలెట్టింది రాగయ్యబుర్ర.

రాగయ్య మళ్లా భార్యతోనయినా సంప్రదించలేదు. కాలికి చెప్పులు తొడుక్కొన్నాడు. ఊరివెలుపల మందబయట దిగిన ఎద్దులబేరగాళ్ల వద్దకు వెళ్లాడు. వాళ్ల నింటికి పిలుచుకొని వచ్చాడు. ఎద్దును చూపించాడు. ఏభయి రూపాయలకు బేరం ఫయిసలు చేసుకొన్నాడు. డబ్బు చేతిలో వేసుకొన్నాడు. ఎద్దుమెడ పలుపు విప్పి బేరగాళ్ల చేతిలో పెట్టాడు. దుఃఖం ఆపు

కోలేక పోయాడు. బొటబొట ప్రవహించింది కన్నీరు. "నామహాలక్ష్మి పోతున్నదే" అని లక్ష్మమ్మ బారు మన్నది.

" మనకి ఋణం తీరిపోయింది—ఊరుకో" అని ఆమెకు ధైర్యం చెప్పాడు రాగయ్య.

" పసిబిడ్డని సాకినట్లు సాకాను. దానితల్లికి పుట్టిన దూడలు నాబిడ్డల్లాగే బతకకుండా చచ్చిపోతుంటే తిరపతి వెంకటేశ్వర్లకి మొక్కుకొని, దీనికి వెంకన్న అని పేరుపెట్టుకొన్నాను. నాకు రమణయ్య ఒకకొడుకూ, ఇదొకకొడుకూ అని అనుకొన్నాను— అయ్యో! వెంకన్నా! నాచేతినీళ్లు నీకు ఋణం తీరి పోయిందయ్యో? పోతుండావా ? ఇక మళ్లా నాకళ్లకు అగపడవూ ? నిన్ను విడిచిపెట్టి నే నెట్లా ఉండేదే ఈకొంపలో ? నువ్వు అగపడకుంటే రమణయ్య కూడు కుడిచి నీళ్లు తాగుతాడా......"అని ఎద్దుమీద చెయ్యి వేసి తెగ ఏడుస్తోంది లక్ష్మమ్మ.

రాగయ్య లోలోపలనే కుమిలిపోతున్నాడు. మొగవాడు తాను. వయస్సుమీరిన అనుభవశాలి. కష్టసుఖాలు తెలుసుకొన్న జ్ఞాని. తనుకూడా ఆడదాని లాగా బెంబేలుపడితే ఎట్లా ? "ఋణానుబంధ రూపేణ పశుపత్నీ సుతాదయః" అని పెద్దలు చెప్పేవాక్యం స్మృతికి వచ్చిం దతనికి.

" ఈ గొడ్డుమీద నీకెందు కీమమకారం? ఋణం తీర్చుకొని దానిదారిని అది వెళ్లిపోతోంది: నువ్వు ఏడవబోకు" అని భార్యకు ధైర్యం చెప్పి తాను ధైర్యం తెచ్చుకొన్నాడు.

బేరగాళ్లు ఎద్దుపగ్గంపట్టుకొని బరబర లాక్కొని పోయారు.

ఎద్దులేక బారుమన్న దొడ్డి చూచుకొని లక్ష్మమ్మ మళ్లా బారుమని దొడ్లోనే ఏడుస్తూ కూర్చున్నది. రాగయ్య ఇంట్లోకి పోయి, చుట్ట ముట్టించి, వాకిలిముంగిట గోడకానుకొని గొంతుకూర్చున్నాడు. దుఃఖభారకంపిత మయిన తన హృదయాన్ని స్వస్థపరుచుకొంటున్నాడు.

కొడుకు రమణయ్య వచ్చి సంగతి తెలుసుకొంటే, తగవులాడుతాడేమోనే అని అతనికి సందేహం కలిగింది. కాని అంతలోనే ధైర్యం తెచ్చుకొంటున్నాడు; నెత్తి మీది బరువును దింపుకోనేనిమిత్తం అమ్మవలసివచ్చిందని చెప్పితే, పిల్లవాడుమాత్రం కాదంటాడా ? అని అను కొన్నాడు.

వీథిలో మళ్లా ప్రత్యక్షమయారు వెట్టివాళ్లు.

" నేను ఎంతపైకం కట్టవలెనో కరణంచేత కాగితం మీద లెఖ్ఖవేయించి తీసుకొనిరండి. పైకం యిస్తాను. తయారుగానేవుంది" అని వాళ్లతో చెప్పాడు రాగయ్య.

" కరణమూ రెడ్డీ కచ్చేరిలో కూచునిఉండారు నువ్వే ఆడదాకా వచ్చిపైకం చెల్లించి రాగూడదయ్యో? అని అడిగారు గ్రామనౌకర్లు.

రాగయ్యకు వీథిలో బడి నలుగురి మొఖమూ చూడ్డానికి సిగ్గయింది; గ్రామాధికార్ల సమక్షంలోకి పోవ డానికి తలకొట్టినట్లయింది: మనస్సు కిష్టపడ లేదు.

" నేను చెప్పానని చెప్పితే కరణం లెఖ్ఖ తేల్చి యిస్తాడు లేరా. నాకు వంట్లో వుసులుగా లేదు. నేను ఇప్పుడు నడిచిరాలేను. కాగితం రాయించి తీసుకొని రండి. ఇదిగో! పైకం సిద్ధంగా వున్నది" అన్నాడు రాగయ్య.

కరణం లెఖ్ఖవేసి, మూడు, నాలుగువాయిదా లకు ఇవ్వవలసిన మాగాణిశిస్తూ, ఉత్తరువు లేకుండా సాగుబడిచేసినందుకు తీర్వజాస్తి నీటి అపరాధమూ, గొడ్డుసెస్సులూ, విద్యపన్నూ, తన జమాబందీ మామూలూ, డి.పి. డబ్ల్యు ఓవర్‌సీరుకి చెందవలసిన మామూలూ, —అమాంబాపతులూ కలిసి రు. ౧౯-౧౨-౦ లకు లెఖ్ఖ తేల్చి కాగితంమీద వేసి పంపాడు. పైకం వెట్టి వాళ్లపరంగా యిచ్చి పంపివేశాడు రాగయ్య. శిస్తు కట్టగా మిగిలినపైకం రు. 30-0-0 లూ పెట్టె తీసి, పెట్టెలో భద్రం చేసుకొన్నాడు.

ఆరోజు పడమట బారెడుపొద్దు తిరిగేవరకూ లక్ష్మమ్మ వంటచేయకుండా ఏడుస్తూనే ఉన్నది.

పొద్దుగూకేముందు ఇన్ని మెతుకులు కొరికాడు రాగయ్య. ఉదయం తొమ్మిది గంటలకల్లా తోలి పెట్టిన ఎద్దు సాయంత్రందాకా తనకళ్ల బడకుండా వున్నందు వల్ల అతనికి మనస్సు ఉండబట్టడం లేదు: పొద్దుగూకిన తర్వాత మందబయటికి పోయి, బేరగాళ్లమందలో కలిసిపోయిన తన ఎద్దును ఒకసారి చూచుకొని మరీ ఇంటికి వచ్చాడు.

ఆరాత్రి వేకువనే బేరగాళ్లు ఎద్దుమందను తోలుకొని పడమటికి వెళ్లిపోయారు.

3

రాగయ్య కడుపున ఎనమండుగురు సంతానం కలిగారు. కాని అతనికి వృద్ధాప్యం వచ్చేవరకు మిగిలిన వాళ్లల్లోకల్లా కొడుకు రమణయ్య ఒకడున్నూ, కూతురు వెంకమ్మ ఒకతీని. ఆడపిల్ల పెద్దమనిషయి భర్తతో సంసారం చేసుకొంటోంది. రమణయ్య ఇప్పుడు పాతికేళ్లవాడు. ఇటీవలనే మేనమామకూతురిని ఏటిఅవతల వివాహం చేసుకొన్నాడు. కాని ఆపిల్ల ఇంకా పసిది: కాపరానికి రాలేదు.

రాగయ్యతండ్రి చనిపోయేటపుడు పదహారెకరాల మాగాణీ, నాలుగెకరాల పశువుల బీడూ, రెండెకరాలతోటా, దొడ్డీ, కపిలెభావీ, ఇల్లూ, రెండుగాళ్ల ఎద్దులూ, నాలుగు పాడిపశువులూ వగైరా స్థిరచరాస్తులంతా కలిసి ఏడెనిమిదివేలరూపాయల ఆస్తి వప్పచెప్పి చనిపోయాడు. కాని ఆస్తితోకూడా తన హయాంలో చేసిన నాలుగువేల రూపాయల అప్పుకూడా చూపించి మరీపోయాడు. రాగయ్య వయస్సులో ఉండంగా కష్టపడి ఆపదహారెకరాల పొలమూ పండించుకొని దాని మీదవచ్చే ఆదాయంలో, అప్పులవాళ్లకి ఏటా కొంత చెల్లువేసి, అంతా పదిపన్నెండేళ్లలో అప్పులేకుండా చేసుకొని, ఆస్తిని మిగుల్చుకొందామని తాపత్రయపడ్డాడు. కాని, పాపం, అప్పటి కతడు ఒంటరిగాడు. ఇంటిదగ్గర సంసారమూ, పొలంలో సేద్యమూ—ఈ రెంటితో తా నొక్కడూ తూగలేకపోయాడు. అదిగాక- చిన్నతనంలోనే తనకు భగవంతుడు సంతానప్రాప్తి కలగజేసినందుకు, ఏ మొగపిల్లవాళ్లయినా, ఒకరిద్దరు బయలుదేరి ఉంటే, ఏదో బర్రెగొడ్డుల నయినా మళ్లవేసుకొని వచ్చేటందుకు ఉపయోగపడేవారు. ఆప్రాప్తంకూడా లేకుండా లక్ష్మమ్మ వరసవరసగా ముగ్గురు ఆడపిల్లలను కనడమూ, వాళ్లల్లో ఇద్దరుపిల్లలు పుట్టిన మూడోనెలలోనే నష్టమైపోవడమూ, ఇప్పుడు వెంకమ్మ మాత్రం మిగలడమూ జరిగింది.

నాలుగువేల రూపాయల అప్పు తీర్చాలంటే సాధ్యమైన పనేనా? అవసరం కొద్దీ, తనతండ్రి ముక్కాలురూపాయీ, రూపాయీ, రూపాయి పావలా-ఈ ప్రకారం బ్రహ్మాండమైన వడ్డీలమీదచేసిన అప్పు. ఈ అప్పుల్లో ఏటా అంతకం తిరిగే ప్రోనోట్లు కొన్నీ, రెండేళ్లకి అంతకం తిరిగేవి కొన్నీ, మూడేళ్లకి తిరిగేవి కొన్నీని. వడ్డీ అసలు కలిసేవరకు, పాపం పెరిగినట్లు, ఇబ్బడికి ఇబ్బడయిపోతోంది అప్పు. ఒకవేళ పొలంమీద వచ్చే గింజలమ్మీ, తోటలో పండే మిరపకాయ లమ్మీ, ఇంట్లో పెరిగిన కోడెదూడల నమ్మీ, పదివరాలు పోగుచేసి బాకీల్లోకి ఏవందో, రెండువందలో చెల్లువేసినప్పటికీ, అసలు అసల్లాగే ఉండడం సరిగదా, వడ్డీలోకికూడా సరిపోవడం లేదు ఆ చెల్లు. దీనికితోడు బాకీదార్లుకూడా అప్పులు కట్టుమని తొందరచేస్తూ వచ్చారు. ఇక ఇది పనిగాదనుకొని తండ్రి గతించిన నాలుగేళ్లకల్లా ఆరువేలదాకా పెరిగిన అప్పుకు సరిపొయ్యే పొలం అయినకాడికి తెగనమ్మి ఋణబాధ అనేది లేకుండా చేసుకోవాలని నిశ్చయపరుచుకొని-పదహారెకరాలలో పది ఎకరాల మాగాణీ, రెండెకరాలతోటా అమ్మివేసి ఋణబాధ పూర్తిగా నివర్తి చేసుకొన్నాడు రాగయ్య. ఇప్పుడు పోగా మిగిలి ఉన్నది నాలుగెకరాల మాగాణికయ్యా, నాలుగెకరాల బీటికయ్యా మాత్రమే.

కష్టపడి చేసుకొంటే మాగాణికయ్య మంచిదే. కనీసం ఎకరాపుట్టి చొప్పున నాలుగెకరాలూ నాలుగుపుట్లు నమ్మకంగా పండితే సర్కారుశిస్తులూ, సేద్యపు

ఖర్చులూ పోను,తన కుటుంబం మనవర్తికి సరిపోతుంది; పరవాలేదు. కాని రాగయ్య అదృష్టానికితోడు ఇప్పటికి అయిదారేళ్లనుంచి ధాన్యానికి ధర తగ్గిపోవడం సంగతి ఎట్లాఉన్నా, నాలుగేళ్లకిందట కొట్టిన గాలివానసంవత్సరం మొదలు ఎందువల్లనో చెరువుకి సకాలంలో నీరు ఎక్కడమూ లేదు, పంటలు సరిగ్గా పండడమూ లేదు. ఎంత ఎరువు తోలినా, ఎంత సత్తువ చేసినా, రాత్రింబగళ్లు కయ్య విడిచిపెట్టకుండా దాంట్లోనే పండుకొన్నాకూడా, ఎకరానికి పందుం, పన్నిద్దుంగింజలు రాలేవరకు కటకటయిపోతోంది. ఈ ఆదాయం చాలక ఈ మధ్య రమణయ్య పొగాకు బేరం ఒకటి పెట్టుకొని, సేద్యం నాద్యంలేని తీరుబడిరోజుల్లో ఏదో పదిరూపాయల పొగాకు కొని, దాన్ని ఏటి అవతల పల్లెల్లోకి ఎత్తుకొనిపోయి, మారుబేరానికి అమ్ముకొని తన పొట్ట గడవగా, నాలుగుపావులు మిగిలితే ఇంటికి చేర్చుకొంటున్నాడు. శరీరకష్టం అంటే అతగాడికి ఒక లెఖ్ఖలోనిది కాదు. మంచి వయస్సులో ఉన్నాడు. అతనికి తల్లితండ్రి అంటే పంచప్రాణాలూను. ఆ తల్లిదండ్రులుకూడా రమణయ్య అంటే అదేవిధంగానే ఉంటారు.

రమణయ్య కొత్తిన పొగాకుమూట పెట్టుకొని పల్లెల్లోనికి పోయి పదిరోజులు దాటింది. ఒకవేళ ఏటి అవతలికి పోయినా, ఎప్పుడుగాని వారంరోజులకంటె ఎక్కువగా నిలిచేవాడుకాడు. అట్లాంటిది ఈసారి మాత్రం ఎందువల్లనో పదిరోజులు దాటి కూడా ఇంకా ఇంటికి చేరుకోలేదు.

వెంకన్ననమ్మి నాలుగురోజు లయింది: అయిదురోజు లయింది: ఆ రయింది: ఏతత్సంబంధమయిన ఎడబాటు రాగయ్యకీ, లక్ష్మమ్మకీ కూడా పరిపాటయిపోయింది. బిడ్డ రమణయ్య ఇంకా రాలేదేమా అని ముదుసళ్లు కొడుకుమీద మరులు నిలుపుకోలేకపోతున్నారు. వెంకన్న విడిచినయింట్లో రమణయ్యఅయినా తిరుగుతుంటే, ఆవృద్ధుల కదొక విధమైన తృప్తీ, ఆనందమూను.

ఏడోరోజు ఉదయం తొమ్మిది గంటలకు రమణయ్య ఇంటికి చేరాడు. వీథివసారాలో మంచం మీదనే పండుకొని ఉన్నాడు తండ్రి రాగయ్య. లక్ష్మమ్మ దొడ్లో కుండలుకడిగిన నీళ్లు బర్రెగొడ్డుతాగే తొట్టిలో పోస్తున్నది. రమణయ్య అడుగుల చప్పుడు విని, దిగ్గున మంచంమీద లేచి కూర్చున్నాడు రాగయ్య.

“ఈతడవ ఇన్నాళ్లు నిలిచినావేమి నాయనా!” అని ఆప్యాయంగా కొడుకుని అడిగాడు.

“ఏందో ఆలస్యమే అయిందే ఈసారి. పోయినవాణ్ణి ఎట్లాగా పోయానుకదా అని మామగారి ఊరికికూడా పోయి, పిల్లవాళ్లని చూచివచ్చా” అన్నాడు రమణయ్య.

కొడుకుమాటల సవ్వడి విని, ఇంట్లోనుంచి వాకిట్లోకి వచ్చింది తల్లి.

“ఏందీ! మామగారింటికి పోయివచ్చావా? అందరూ బాగుండారా?” అని తానుకూడా అడిగింది.

“ఆ! అందరూ బాగానే ఉండారు. మామ కాలు ఈమధ్య ఎద్దు తొక్కిందట. పాదంఅంతా మోపుచేసి వారంరోజులుగా ఆయన లేవలేకపోతున్నాడు” అని సమాధానం చెప్పాడు రమణయ్య.

“అయ్యో! మరి ఆసంగతి చెప్పిపంపనే లేదు చూడు, వాళ్లు. పోయి చూచేనా వద్దును ఒకసారి” అన్నది లక్ష్మమ్మ.

“ఇప్పుడు నయమయిందిలే: ఎవడో మంగలివాడిచేత కాలు తోమిస్తుండాడు. ఇప్పుడిప్పుడే కాలు కిందపెట్టి లేచి తిరుగుతున్నాడు.”

“సరే: బాగానే ఉండది” అంటూ లక్ష్మమ్మ లోపలికి వెళ్లిపోయింది.

“ఎండపడింది. కాళ్లూ మొఖమూ కడుక్కొని, చద్దినీళ్లు తాగు నాయనా: ఆకలెసిందేమో ఆ మొఖం” అన్నాడు తండ్రి.

నెత్తిని చుట్టిన గుడ్డ తీసి మంచంకోడిమీద వేసి, జుట్టుముడి విప్పి, రెండు చేతులా దులుపుకొని మళ్లా ముడివేసుకొన్నాడు రమణయ్య. పళ్లు తోముకోను దొడ్లో వరల బావికాడికిపోయి, ఎద్దు సంగతి జ్ఞాపకానికి రాగా, పశువుల చప్పారంలోకి పోయి చూచాడు. దున్నపోతు మాత్రం గాటకట్టివేసి ఉన్నది. ఎద్దు లేదు. పాలు తాగే బర్రెదూడ పండుకొని నెమరు వేస్తోంది. బర్రె పొలంపోయింది కాబోలు ననుకొన్నాడు. మరి ఎద్దు ఏమయిందా అని సందేహం కలిగింది.

బావికాడ పళ్లుతోముక్కొని మొఖమూ కాళ్లూ కడుక్కొని ఇంట్లోకి వస్తూ,

"ఎద్దునికూడా పొలం తోలిపెట్టావా ఈపొద్దు" అని తల్లిని అడిగాడు.

"పొలమూ లేదు, వల్లకాడూ లేదు నాయనా" అని నిట్టూర్చింది తల్లి.

"మరిఏమయిందీ ఎద్దు?"

"పడమటి ఎద్దులబేరగాళ్లకి ఏభయిరూపాయలకి అమ్మివేశాడు మీ అయ్య. ఏం చెప్పమంటావు నాయనా?" అని కన్నీరు నించింది పొయ్యికాడ కూర్చున్న తల్లి.

రమణయ్య నడుం కరేలుమన్నది. ఎద్దును అమ్మడమేమిటో అతనికి అర్థం కాలేదు:

వాకిట్లోకి పరుగుపెట్టాడు.

"ఎద్దు నెందుకు అమ్మావే, నాయనా?" అని తండ్రిని అడిగాడు.

"సర్కారు శిస్తుకి రెడ్డి తొందరచేశాడు. నువ్వు సమయానికి ఇంటికాడ లేకపోతివి. నేను ముసలాణ్ణయి లేవలేకపోతిని........."అని ఏమో చెప్పబోయాడు రాగయ్య.

రమణయ్యకు చికాకనిపించింది:

"ఏమిశిస్తే? ఈ యేడు మనకయ్యలన్నీ ఈటుపోయినవి. మన కీయేడు శిస్తు ముజరాఇస్తారని నాతో చెప్పాడు కరణం. ఇంకా శిస్తు-శిస్తు- దానితల్లికడుపుకాలినశిస్తు—ఇంకా శిస్తు ఎక్కణ్ణుంచి వచ్చిందే" అని పెద్దగా అరిచాడు రమణయ్య.

"నా కేం తెలుసు ఆసంగతి? ఇరవైరూపాయలు శిస్తుకట్టాలి. కట్తావా లేకపోతే ఎద్దుని జప్తీచేయమంటావా అని రెడ్డీ, కరణమూ చేరి వెట్టివాళ్లని ఇంటిమీదికి పంపించారు. నన్నేంచేయమంటావు చెప్పు?"

"అయితేమట్టుకు; నేను వచ్చేవరకూ నిలవనైనా నిలవకుండా బంగారువంటి ఎద్దును అమ్ముకొంటారటయ్యా? నీ కెవరు చెప్పారే ఈ సలహా?"

"చెప్పాను నాయనా? పిల్లోడు వస్తాడు, రెండు రోజులు నిదానించండయ్యా అని బతిమలాడుకొన్నాను. కాని వాళ్లు మనమాటలు వింటారా చేస్తారా?"

"అయ్యయ్యో: ఎంతపని చేశావయ్యా? నోటికాడకూడు పోగొట్టుకొంటారటయ్యా ఎవరైనాను? నీ కేమంతతొందర వచ్చిందే, నేనురాకుండానే నిక్షేపంవంటి ఎద్దును నాశంచేశావుగదయ్యా" అని కింద కూలబడ్డాడు రమణయ్య.

"మన వెంకన్నకీ, మనకీఋణం తీరిపోయింది నాయనా. బిడ్డనిసాకినట్లుఎనిమిదేళ్లుసాకాను. ఏంక్రియ? బంగారంవంటి ఎద్దుని అమ్మి పైకం కట్టేదాకా నిలవనిచ్చాడా ఆరెడ్డి? సాటికాపువాడయి తేమట్టుకు, ఏంప్రయోజనం? ఏంచేస్తాం? మనఖర్మ అట్లా తెల్లవారింది." అని కంటనీరుపెట్టుకొంది లక్ష్మమ్మ.

"నీ కెవడు చెప్పాడయ్యా ఈ ఆలోచన? అయ్యయ్యో. బంగారం. బంగారం కాని అది ఎద్దా? ప్రాణంతో సమానంగా సాకుకొన్నానయ్యా దాన్ని. ఆఎద్దు నాధారంచేసుకొని ఆ నాలుగెకరాల కయ్యా చల్లుకొంటున్నాను. నాశనం అయింది గదయ్యా నాఎద్దు" అని రమణయ్య వలవల ఏడుస్తున్నాడు.

"ఊరుకోనాయనా, ఊరుకో. తీరిపోయింది, దానికీ మనకీ ఋణం తీరిపోయింది. నేనూ ఇల్లాగే మన

స్నపట్టలేక ఈ వారంరోజులూ ఏడ్చాను. ఏంచేస్తాడు మీనాయనమట్టుకు? ఇంతకాలమూ బతికి వెట్టివాళ్లచేత ఎద్దుని యీలంవేయించుకోడానికి, ఆయనకు తలకొట్టినట్లనిపించి, ఆఖరికి ఆ యెద్దునయినా అమ్మి, సర్కారు బదనాయం తొలగించుకోవలసివచ్చింది.—లే; ఊరుకో. రమణా! ఊరుకో."

రమణయ్యకు ఎక్కిళ్లు వస్తున్నవి.

"పశువయితే మట్టుకు, పశుజన్మ ఎత్తవలసిందా? అది పసిబిడ్డే. ఒకకొమ్ము మ్మాడించి ఎరుగా? ఒక తోకాడించి ఎరుగా? కాలు జాడించి ఎరుగా?- సాధువంటేసాధువా—అది,ధర్మరాజే! మాటలునేర్చిన గొడ్డు. తిరపతి వెంకటేశ్వరులు మళ్లా మన ఇంట వెలిశాడని సంతోషించాం. మనఇంటబుట్టినదూడ మన ఇంటనే మట్టి అవుతుందనుకొన్నాం. ఇంతకీ దానికి సుఖపడేయోగంలేదు........."

"....................."

"ఆ పడమటివాళ్ల చేతుల్లో పడింది. దాని రాత ఏరాళ్లపాలు గావలసిఉన్నదో? ఏకసాయివాళ్ల చేతుల్లో పడుతుందో?.—తలుచుకొంటే, ఊఁ-కడుపు తరుక్కొని పోతుంది నాయనా?......ఇన్నాళ్లు దాని అస్థులూ చర్మమూ మనకి ధారపోసి చాకిరీచేసినందుకు, దానిపట్ల మనం విశ్వాసం చూపించలేకపోయాం. ఏమీ, మనిషిజన్మ అయి పుట్టితేమట్టుకు దాని ఋణం మనం వెయ్యిజన్మాలకయినా తీర్చుకోగలమా?" అని లక్ష్మమ్మ కన్నీరు ఒత్తుకొంది.

మంచంమీద పండుకొన్న రాగయ్య ముక్కు తుడుచుకొని కళ్లు చికిలించాడు.

"నా వెంకన్నా! ఇక నాకు అగపడవా! పదిహేనురోజుల కిందట చూసినచూపే కడసారి చూపా?" అని రమణయ్య బోరుమన్నాడు.

"నీ కేమి పిచ్చా ఏమిటి రమణా? ఊరుకో. ఏం దీ పిచ్చి చేష్టాలు—శుభమల్లె! రెండు రోజులు తాళండయ్యా, పిల్లవాడు వచ్చి మీపైకం మీకు కట్టుతాడని బ్రతిమలాడితే వినకుండా కాళ్లకింద నిప్పులు పోసి కొట్టిన ఆరెడ్డినీ కరణాన్నీ అనుకోవాలిగాని.— మనం ఎంత ఏడిచి ఏం ప్రయోజనం? లే, చద్దన్నం తిందువుగాని లే. వేళకు తిండీ నీళ్లూ అమరక మనిషివి అసలే చిక్కిపడి ఉండావు" అని ఓదార్చింది తల్లి.

రమణయ్యకు దుఃఖంపోయి, దాని స్థానంలో రోషం పుట్టింది. గ్రామాధికార్లు రెండురోజులు నిదానించి ఉంటే తన ఎద్దు తనకి దక్కి ఉండునని అతనికి నమ్మకం తోచింది. కరణంమీదా, మునసబుమీదా అతనికి పట్టరాని ఆగ్రహం వచ్చింది. వాళ్లతో తాను తగవులాడలేకపోయినా, వెళ్లి తన అక్కసం తీరేలాగ వాళ్లని మొఖంమీద నాలుగుమాటలూ అనేసి రావాలని అతనికి ఉద్రేకం కలిగింది. ఒళ్లు వేడెక్కింది. ఆ వీరావేశంమీద కూర్చున్న మనిషి గభాలున లేచి—

"వెళ్లి నాలుగుమాటలూ మొఖంమీద అడిగివస్తానుండు—ఈ మునసబునీ కరణాన్నీని" అని బయల్దేరాడు రమణయ్య.

"అబ్బాయీ! నువ్వేమీ తొందరపడవద్దు. నామాట విను! నువ్వు అధికార్లతో తగవు పెట్టుకొంటే నీకే తగులుతుంది దెబ్బ. నిదానించు. మన ఖర్మకి గ్రామాధికార్లు కర్తలా" అని తండ్రి అడ్డుతగిలాడు.

"నే నేమీ తగవులాడను లేవే? ఆశిస్తేమిటో, ఆలెక్క ఏమిటో—లెక్కయినాచూపించుకొనివస్తాను. మనకిఇంకా ఇరవై రూపాయల శిస్తు ఏడనుండివచ్చిందీ? అంతశిస్తు కట్టవలసినట్లు నాకు జ్ఞాపకంలేదే?"అని బయటికి వచ్చాడు రమణయ్య.

"అబ్బాయీ! నువ్వు అసలే కోపదారి మనిషివి. వాళ్లతో అనవసరంగా తగువులాడక నీపనేమిటో అది చూచుకొనిరా" అని తండ్రి మళ్లా బోధించాడు.

ఎకాయెకీని రమణయ్య గ్రామ చావడికి పోయాడు. కరణమూ, మునసబూకూడా కూర్చుని పైకం వసూలుపనిలోనే ఉన్నారు. ఇంకా ఇతర రైతులు నలుగురైదుగురు కూడా లెక్కలు చూపించుకొంటున్నారు.

"ఏమయ్యా! మునసబుగారూ! నీకు సర్కారు వాళ్లు అధికారం యిస్తేమట్టుకు మాబోటి బీదవాళ్లని గొంతుకు తెగ్గోయుమనికూడా అధికారం యిచ్చారా?" అని పెద్దంగా అడిగాడు రమణయ్య.

"గొంతుకు తెగ్గోస్తే ఉరిశిక్ష వేస్తారు సర్కారు" అని ఎగతాళిగాజవాబిచ్చాడు మునసబు.

"అది కాదయ్యా! నీకు శిస్తుపైకం కట్టవలసి ఉంటే మాత్రం, నేను ఇంటికాడ లేకుండా చూచి ముసలాణ్ణిఏపించుకొని తిని ఎద్దును అమ్మిస్తావుటయ్యా? నువ్వు మాత్రం కాపోడివి కాదూ? నీకుమాత్రం సేద్యం లేదూ? నీకు మాత్రం పశువులు లేవూ?"

"నిజమేరా! ఉన్నాయి. ఉంటే? మీ నాయన్ని ఎద్దుని అమ్మవలసిందని నేను బదనాయం చేశానా?"

"పైకం కట్టకుంటే, ఎద్దుని జప్తీచేస్తానని వెట్టి వాళ్లని ఇంటిమీదికి పంపితే, దాని అర్థం ఏమిటి?"

"ఏమయ్యా! మునసబుగారూ! నీకు సర్కారువాళ్లు అధికారం యిస్తేమట్టుకు మాబోటి బీదవాళ్లని గొంతుకు తెగ్గోయుమనికూడా అధికారం యిచ్చారా!"

"సర్కారుశిస్తు కట్టకుంటే, జప్తిచేయక ముద్దు పెట్టుకొంటారా?"

"రెండురోజుల్లో నేను వస్తానే ఉంటినే? అంతమాత్రంనిదాని స్తేసర్కారువాళ్లుపీకి తెగ్గోస్తారాఏందయ్యా?"

"ఎవరిమట్టుకు వాళ్లు వాయిదాలు వేస్తుంటే ఇక పని జరిగేది ఎట్లా?"

"నాశనం చేశారు గదయ్యా, మీరందరూ చేరి, ఎద్దును: మాబోటి బీదోళ్లని ఇట్లా ఏడిపిస్తే మీబోటి గొప్పోళ్లకి మేలు లేదయ్యా. ఆ ఒక్క ఎద్దూ అట్లా అన్యాయం అయిపోయిందే, ఇక నేను దేనితో సేద్యం చేసుకోనేనో మీరే చెప్పండయ్యా?" అని అక్కడ ఉండిన నలుగురు రైతులకేసిచూచి దీనంగా అడిగాడురమణయ్య.

రమణయ్య అమాయకత్వానికీ, అతని. నిష్కాపట్యానికీ అక్కడ చేరిన రైతులకేగాక, మునసబుకీ, కరణానికీకూడా నవ్వు వచ్చింది.

"నవ్వుతా రెందుకయ్యా? ముసలాడిదగ్గర ఇరవై రూపాయలు గుంజుకొన్నారట. అంతశిస్తు ఏడనుంచి వచ్చిందయ్యా రెడ్డిగారూ?" అని అడిగాడు రమణయ్య.

"ఆసంగతి కరణాన్ని అడిగి లెఖ్ఖ చూపించుకో" అన్నాడు రెడ్డి.

"ఏమయ్యా కరణమయ్యా! నువ్వు ఏటా అయిన కాడికి మాదగ్గర జమాబందీమామూలనీ, వల్లకాడు మామూలనీ ఊడేస్తూనే ఉంటివి. ఇప్పుడింత శిస్తు ఏడనుంచి వచ్చిందీ?" అని కరణాన్ని అడిగాడు.

కరణం చిరునవ్వు నవ్వాడు.

"నీమాగాణికయ్య నాలుగెకరాలకీ ఇరవై రెండు రూపాయలు మాగాణిశిస్తు ఇవ్వబనిలేదట్రా?"

"రామరామ! ఈ ఏడు ఆపొలంలో చిట్టెడుగింజలు కళ్ల చూచింది లేదే? పొట్టితాలూ బొందూ కోసుకొని తెచ్చుకొంటిమే! నువ్వు తణిఖీ చేసికూడా వస్తివే! పంటలేదని రాసి, శిస్తు ముజరా యిప్పిస్తానని చెప్పితివి గదయ్యా!"

"చెప్పినమాట నిజమే. నీనంబరులో మూడున్నర ఎకరాలో పైరు పోయిన మాట నిజమే. కాని మిగిలిన అరఎకరా పండిందికదూ?"

"నాలుగెకరాల కయ్యలో ఒక అరఎకరా పండితే పూర్తిశిస్తు కట్టవలసిందేనా?"

"ఆహా!"

"ఇదేమి ఘోరమయ్యా?"

"కొరవ నెంబర్లకి శిస్తు ముజరా ఇవ్వర్రా సర్కారువారు."

"ఆకొరవమాత్రం ఏమిపండిందయ్యా? కూలి ఖర్చులకే చాల్లేదు ఆనలుతుము గింజలున్నూ."

"అందుకనే నేనూ ఇన్స్పెక్టరూ వేయడంలో నీనెంబరంతా కలిసి సగటున ఒకఅణాఫలితంమాత్రమే వేశాం. కాని తహశీల్దారు ఒప్పుకోలేదు. నాలుగెకరాల్లోనూ అరఎకరాలో పైరు వెన్నుదీసి కాస్తనదరుగా అగపడేవరకు ఆయన సరాసరి రెండణాల ఫలితం వేశాడు. దానితో అంతా తుడిచిపెట్టుకొనిపోయింది."

"రెండణాలఫలితం పండితే ముజరా ఇవ్వరా?"

"ఇవ్వరు రెండణాలకు లోపలనే ఉండాలి ఫలితం. అదిగాక నీ పొలానికి ఆజుబాజులో ఉండే కయ్యలన్నీ సుమారుగా పండినట్లు తహశీల్దారు రాసుకొనిపోయాడు. నీ పక్కభూములు పండి, నీ భూమి పండకుంటే, అది రైతు కసూరీవల్ల జరిగిందిగాని, సర్కారువారి జవాబ్దారీ కాదని, నీకు ముజరా ఇవ్వడానికి వీల్లేదని తోసేశారు... ఈబిజుకోళ్లన్నీ మీకేం తెలుస్తాయి?"

"ఏమి అన్యాయపు కాలం వచ్చిందయ్యా! సరే. నీవన్నట్లే మాగాణిశిస్తు ఇరవైరెండు రూపాయల్లోనూ పదకొండు రూపాయలు మొదటి రెండువాయిదాల్లోనూ చెల్లిస్తినే—ఇంకా ఇప్పుడు ఇరవైరూపాయలెట్లా అయింది శిస్తు?"

"నువ్వు ఇసకకయ్యలో చేసిన తీర్వజాస్తిసంగతి మరిచావా ఏమిటి?"

"దాని కెంత పడిందేమిటి శిస్తు?"

"పావలాతక్కువ ఏడురూపాయలు."

"ఏందీ, ఆ ముంతెడు విత్తనాలపట్టుకీ ఏడు రూపాయలశిస్తేందయ్యా? నువ్వేమో మాకొంపలు ముంచేటట్టుగా ఉండావే?"

"అది మెట్టభూమికదట్రా; దానికి ఉత్తర్వు లేకుండా నువ్వు నీళ్లు తీసుకొన్నందుకు అయిదున్నరరూపాయి అపరాధం వేశారు. అపరాధమూ, శిస్తూ కలిసి ఆరుమ్ముక్కాలు రూపాయి అయింది."

"ఇదేందబ్బా, ఈ విడ్డూరమూ? ముంతెడు విత్తనాలపట్టుకేందీ, ఏడురూపాయలశిస్తేందీ?...... కొంపలు పెరుక్కొని ఏడకయినా లేచిపోవలసినట్టుగా ఉందికాని..............."అని ఆశ్చర్యపోతున్నాడు రమణయ్య.

ఇదంతా చూస్తూ ఉండిన రైతులు పకపకా నవ్వుతున్నారు.

"మేమూ ఇట్లాగే ఏడుస్తున్నాంరా నాయనా పొద్దుటినుంచీ. మాగోడు ఆ పరమాత్ముడికే ఎరుక. మాకుకూడా తలా అయిదూ, పదీ అపరాధాలు పడ్డాయి. ఏందో హెచ్చుమాగాణి కేటంటూ, దానిలో తగ్గ మెట్ట కేటు తోసేస్తారంటూ, దానికేమో ఇబ్బడీ, ముబ్బడీ కడతారంటూ...........ఏమిటో చెప్పుతున్నాడు కరణం. ఆయనగారు చెప్పే దేమిటో మా కేమీ బుర్ర కెక్కడం లేదు. పొద్దుటినించీ, మేము ఎంతెంత శిస్తు కట్టాలెనో మాకు తెలియక కొట్టుమిట్లాడుతున్నాం. ఎవడితో చెప్పుకోవాలో తెలియడంలేదు...."

అని ఆరైతులు రమణయ్యతో చెప్పారు.

"అదిగాదయ్యా కరణంగారూ! నాతీర్వజాస్తి పాదికి నీళ్ల ఉత్తర్వు తెప్పిస్తానని చెప్పి, నువ్వు చేసుకో మంటే కదయ్యా, నే నా కయ్యలో ప్రవేశించాను. లేకుంటే నాకెందు కా లట్టాలు..." అని రమణయ్య అడిగాడు కరణాన్ని.

"అవును రా! నిరుడు సంవత్సరం గ్రామంలో పెద్ద పెద్ద రైతులందరూ ఉప్పత్తులుపడి ఒకరిమీద ఒకరు సొడ్డుపెట్టుకొని ఆ వోవయశీగుకు చెల్లించ వలసిన ముడుపు చెల్లించనేలేదు. అందువల్ల ఈ యేడు ఈ వూళ్లో తీర్వ జాస్తి కేసులకు ఉత్తర్వులు ఇవ్వ డానికి వీల్లేదని, ఆయన పైకిరాసి, అందరికీ తోక తెగ్గో శాడు. న న్నేం చేయమంటావు?"

"మీా ఇష్టంవచ్చినట్లు ఏడిపించండయ్యా మమ్మ ల్ని. మాకేం తెలుస్తాయి ఈ తిరుగుళ్లు? పశువులం మేం. అట్లా బంగారంవంటి ఎద్దు మట్టిగడ్డలయిపోయిందనే ఏడిచేదా, ఇక్కడ అపరాధాలు చెల్లించవలసివచ్చిందనే ఏడిచేదా! ఛీ! గుక్కెడు విషం తాగి చస్తే మేలు, ఈ గడ్డన బతికేదానికంటె. ఏడిపించండి. తల్లి అయినా మీారే, తండ్రి అయినా మీారే అని, కరణం మునసబు ల్నిద్దర్ని నమ్ముకొన్నందుకు, మమ్మల్ని మీా రేం చేస్తే చెల్లుబడి కాదు గనక! మమ్మ ల్నిట్లా తడిగుడ్డలతో కోసే బదులు, ఒక్కసారి పడేసి ఏటపోతును నరికి నట్లు నరికిపారేయరాదూ" అని ఇట్లాగే ఏమేమో సణుగుకొంటూ ఇంటికి చక్కాపోయాడు రమణయ్య.

౪

ఎన్నివిధాల ప్రయత్నించినా రమణయ్యకు వెంకన్నమీాదనుంచి మనస్సు మరలడం లేదు. ఎన్ని తంటాలయినా పడి, పడమటి బేరగాళ్ల పోబడీ తెలుసుకొని, వాళ్ల డబ్బు వాళ్లకి వాపసుఇచ్చి తనఎద్దును తాను మళ్లా ఇంటికి తెచ్చుకోవాలనికూడా అతనికి అదే ఆలోచనగా ఉన్నది. కాని—చేతిలో చిక్కినఎద్దును మళ్లా వాళ్లు ఇస్తారా? ఇంకో నాలుగురూపాయలు లాభం చూపి అడిగితే ఎందు కివ్వరు?—వాళ్లు బేరగాళ్లుకదా. పోనీ, ఎద్దును ఇవ్వకుంటేమానె, వాండ్ల ఆచోకీ తెలిస్తే పోయి ఎద్దు నయినా కళ్లతో ఒకసారి చూచి రావచ్చును అని ఆలోచించాడు రమణయ్య. పడమటి వాళ్ల దేవూరో అని తండ్రి నడిగాడు.

"వెలిగొండలికి అవతల అదేదోవూరని చెప్పారు. నాకు జ్ఞాపకంలే" దని చెప్పాడు తండ్రి.

రమణయ్య గ్రామంలోకి పోయి, బేరగాళ్లవిషయమై వాళ్లనీ, వీళ్లనీ విచారించాడు; కాని వాళ్ల స్వగ్రామం ఏదో తెలియదని కొందరూ, తెలిసినా నీకు వా ళ్లింకా చిక్కుతారా, ఏవూరు పోయారో, ఎక్కడ తిరుగుతున్నారో అని కొందరూ, వాళ్లీపాటికి వెలిగొండ దాటిపోయి ఉంటారని మరికొందరూ, ఇంకా నీకు ఎద్దుమీాద ఆశ ఎందుకని కొందరూ—ఈవిధంగా అతనికి నిరుత్సాహకరమైన సమాధానాలు చెప్పారు గ్రామంలోని రైతులు. బేరగాళ్లని వెదకి పట్టుకోవడం సాధ్యమైనపనిగా తోచలేదు రమణయ్యకి. తాను ఒంటరిగాడు. ఇంటికాడ ముసలివాళ్లని విడిచి, తాను ఎన్ని ఊళ్లని తిరగగలడు? ఎంతకాలం అని తిరగగలడు? అది కాక, తా నాప్రయత్నమేమీా పెట్టుకోవద్దని ఇంటి దగ్గర తల్లీ తండ్రీకూడా చాలాదూరం చెప్పారు. ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు రమణయ్య.

పొద్దుపోకులూ కాలుకాలిన పిల్లిలాగ తిరిగి తిరిగి సాయంకాలానికి ఇంటికి ఘటం చేరవేశాడు రమణయ్య. అతనికి మనస్సు కుదుటపడడంలేదు; దొడ్లో ఎద్దు లేకపోవడం అతనికి ఇల్లంతా బారుమనిపోయింది. బయట వీథిలో పొయ్యే పశువుల్నీ ఎద్దుల్నీ చూచుకొని ముచ్చటపడుతున్నాడు. ఎక్కడికి పోయినా, సాయంకాలానికి తనయిల్లు చేరుకొంటూ ఉండేదే అని ఎద్దు వస్తుందేమో అన్నట్లుగా వీథివాకిట్లో ఎదురుచూస్తూ నిలిచేవాడు. దొడ్లోకి పోయి చప్పారంచుట్టూ తిరుగుతూవుండేవాడు. ఎద్దుకు కట్టే గుంజవైపు ఆ ట్టే పరకాయించి చూచాడు. ఎద్దు అక్కడ నిలబడి చేత్తో మెడ దువ్వమని తలపైకెత్తినట్టుగానే గోచరించిందతని కళ్లకి. మళ్లా అంతలోనే వట్టి గుంజమాత్రమే కనిపించింది. అతనికి పెద్దదుఃఖం పొంగివచ్చింది. ఎద్దు యింటికి వచ్చేవేళ, ఎద్దుకి బుట్టమేపుపెట్టే సమయం, గాడిలో పచ్చిగడ్డి వేసేకాలం,—ఇవన్నీ అతనికి జ్ఞాపకానికి వచ్చినై; కాని వీటిల్లో ఏపనీకూడా చేయవలసిన అవసరం లేకుండాపోయింది. తనకి చేయి విరగగొట్టినట్టుగా ఉంది. వాకిట్లో గోడ కానించిన నాగేలీ, కాడిమానూ అతనికళ్లల్లో పడినవి. ఎద్దు జ్ఞాపకానికి వచ్చింది. కళ్లు చెమ్మగిల్లినై. కళ్లల్లో మెదిలాడు వెంకన్న. ఒకక్షణం నాగేలివైపు చూస్తూ నిలబడ్డాడు. "ఇంక నేను సేద్యం ఎట్లా చేసుకొనేదే, వెంకన్నా." అని కళ్లు తుడుచుకొన్నాడు.

రమణయ్య ఇంట్లోకి వచ్చాడు: గోడలో కొయ్యకు తగిలించిన మువ్వలూ, గంటా, తోలుపట్టెడా, చిరుమోరతాడూ అగపించినవి అతనికళ్లకి. ఇక తానాదుఃఖం పడలేకపోయాడు. ప్రక్కనే నులకమంచంమీద బోర్లగిలాపడి డొక్క ఎగరవేస్తున్నాడు.

గంటసేపయింది రమణయ్య ఆవిధంగా పండుకొని. రాత్రి భోజనాలవేళయింది: తల్లి వచ్చి అన్నానికి రమ్మని పిలిచింది. ఆకలవడంలేదు, భోజనానికి రానన్నాడు రమణయ్య.

"ఇదేంది అబ్బాయీ! నీకిదే పిచ్చిగా ఉన్నదే. పోతే పోయిందిలే ఎద్దు. దానికోసరం దిగులుపడి, కూడూ, నీళ్లూ మానుకొంటారా? నువ్వు మొగవాడివి. నీకేం? నీరెక్కలు బాగుంటే, ఇట్లాంటి ఎద్దుల్ని లక్ష సంపాదించుకోవచ్చు. ఇట్లా దిగులుపడి కూచుంటారా? బాగానే వుంది — అన్నానికి లే" అని తల్లి పిలిచింది.

"........................"

"నువ్వీవిధంగా దిగులుపడ్డావని ఆముసలాయనకి ఎంతో కష్టంగా ఉంది. దాని కాలం, కర్మం ఒనగూడి వచ్చి, శనిగాడు నెత్తినెక్కినందువల్ల, దాన్ని అమ్మవలసివచ్చి అమ్మాడుగాని—ఆయనకి మాత్రం ఎద్దుని అమ్మడం సంతోషమా ఏమిటి? లే! నువ్వు లేచి రెండుమెతుకులు తింటేనేగాని ఆయన లేవడు. పాపం! ఆయనది పెద్దప్రాణం. ఒక్కగాక ఒక్కబిడ్డవు, నీమీద ప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్నాం మేమిద్దరమూను. లే. నాయనా, లే!" అని బలవంతం చేసింది తల్లి.

తనస్థితి చూచి తండ్రి కష్టపడుతున్నాడని వినేవరకు రమణయ్యకు హృదయం విరిగిపోయింది. ఒకవేళ తనకి బాధగా ఉంటే—దాన్ని తండ్రికి తెలియపర్చకుండా కడుపులోనే దాచిపెట్టుకోవడం మంచిదనుకొన్నాడు; లేచి భోజనం చేశాడు.

దినములు గడిచిపోతున్నవి. వెంకన్నని అమ్మివేసి ఒకటి, రెండు, మూడు నెలలయింది. వృద్ధుడయిన రాగయ్య ఒకరోజున అకస్మాత్తుగా జబ్బుచేసి, కొడుకు చేతులమీదుగా అవతలికి దాటుకొన్నాడు. రమణయ్య భుజాలమీది భారం బరువెక్కినట్టయింది.

మరుసటినెలలో భార్య కాపరానికి వచ్చింది. రమణయ్యజీవితంలో సుఖమూ, దుఃఖమూ రెండూ కూడా పొడగట్టాయి. ఆ రెంటినీ వేసుకొన్న కావడిబద్ద బరువెక్కి నడుస్తూవుంటే అతని నడుములాగే అదికూడా జవజవలాడుతోంది.

పొగాకుబుట్ట నెత్తినివేసుకొని పల్లెల్లో తిరిగి బేరం చేసుకొంటూనే ఉన్నాడు రమణయ్య. ఏవూరు పోయినా వెంకన్న జాడ ఏమయినా గుర్తు చిక్కుతుందే

మోనని ఇంకా అతనికి అడియాస కొట్టుకొంటూనే ఉంది కొనఊపిరితో. కనబడిన పశువులమందనంతనీ కలయ వెదుకుతాడు; తనకు పరిచయముండిన బంధుమిత్రుల నందరినీ తరిచితరిచి అడుగుతాడు; దృష్టిలో పడ్డ ఎద్దునల్లా దీక్షతో పరిశీలిస్తాడు. వెంకన్న పోలికలు గల ఎద్దు తనదృష్టికి తగిలితే భ్రమపడి దానికోసం కుండేలు గొంతుక్కంటూ పరుగులు తీస్తాడు. అది తన వెంకన్న గాకుంటే వెంటనే నిట్టూర్పు విడుస్తాడు. దాన్నీ జన్మలో మళ్లా తానొక్కసారి చూడాలని అతనికోరిక; అంతే అతని ఆశ!

"వెంకన్న ఇప్పుడు ఏసంపన్న గృహస్థు ఇంట్లో పెరుగుతున్నాడో — సుఖమేపడుతున్నాడో కష్టమే పడుతున్నాడో! దాని ఖామందు దాన్ని సరిగా విచారిస్తున్నాడో లేదో! ఇంతకాలం అది మన ఇంటివద్దనే పుట్టిపెరిగిందే, మన ఊరు, మన ఇల్లు దానికి గుర్తేనే. పోనీ ఒకసారి తప్పించుకొనయినా అది మన ఇంటికి రాగూడదూ? ఒక్కసారి తనివితీర దాన్ని చూచి మళ్లా పంపివేద్దునే! నాగొంతుకు సవ్వడి చెవినిపడితే అది పసికట్టుతుందే. నావాసన అది నిమిషంలో పసికట్టుతుందే. నానడక దానికి గుర్తేనే!" ఇట్లా లోలోపలనే ఆరాటిస్తూ ఉంటుందతని మనస్సు.

దినములు గడిచినకొద్దీ, తానీజన్మలో మళ్లా వెంకన్నను చూడగలనన్న ఆశ పూర్తిగా వదలుకొన్నాడు రమణయ్య. రానురాను ఆచింతనే మరచిపోయాడు.

రమణయ్య తన సంసారమేమో, తన భార్య ఏమో—తన సౌఖ్యమేమో, ఈ లోకంలోనే మునిగి తేలుతున్నాడు.

ॐ

ఎంతలో తిరిగివస్తుంది కాలం! వెంకన్నని అమ్మి అప్పుడే ఏడునెల లయింది.

అది మార్గశిరమాసం. చలి వడకించేస్తోంది.

మామూలు ప్రకారం లక్ష్మమ్మ వేకువనేలేచింది. ఇంట్లో పిల్లవాడూ, కోడలూ ఇంకా గాఢనిద్రలోనే వున్నారు. కోళ్లు కొక్కొరోకో యని కూస్తున్నాయి.

సంజ వెల్తురు వచ్చింది. మంచు దట్టంగా పట్టింది. వాకిట కసవు చిమ్మకోను లక్ష్మమ్మ మంచం విడిచి తలుపు చిలుకుతీసి ముంగిట్లోకి వచ్చింది. చేతిలో పొరకకట్ట తీసుకొని వీథివాకిలి తెరిచింది. తలుపు తెరిచీ తెరవడంలోనే బక్కచిక్కిన ఒక ఎద్దు గభాలున తోసుకొంటూ ఆమెమీదికి వచ్చింది. ఇంకా నిద్రకళ్లమీదా, మత్తుమీదా ఉన్నదేమో, కొమ్ములు ముందుకు వంచి తోసుకువచ్చే ఆ ఎద్దును జూచి పొడుస్తుందేమోనన్న భయంచేత ఆమె వెనక్కి రెండడుగులువేసింది. ఎద్దు ముంగిటిలో ప్రవేశించి దొడ్డిలోకిపోయే ఉత్తరపుతట్టుసందు ముఖం పట్టింది. "హా, హా, హా" అంటూ సమయానికి కర్రేదీ చిక్కనందువల్ల, పొరకకట్టతోనే ఎద్దుని అదలించి వెనక్కి మళ్లగొట్టడానికి ప్రయత్నించింది లక్ష్మమ్మ. కాని ఆ అదలింపులు లెక్కపెట్టకుండా ఎద్దు దొడ్లోకి పోయింది.

దొడ్లో చప్పారంలో పాలిచ్చే బర్రెపడ్డా! దూడా, దున్నపోతూ ఉన్నవి. ఈ ఎద్దు ఎవరిదో, ఆ పశువుల్ని పొడుస్తుందో ఏమో! ఎంత అదలించినా జమలేకుండా దూసుకొని దొడ్లోకి పోయింది. లక్ష్మమ్మకి ఖంగారు పుట్టింది.

"అబ్బాయి! అబ్బాయి! రమణా! ఇట్లారా" అని పిలిచింది లక్ష్మమ్మ.

"ఎందుకు?" అని నిద్ర మంచంమీదనుంచే పలికాడు రమణయ్య.

"ఎవరిదో ఎద్దు దొడ్లోపడి నానాబీభత్సం చేస్తుందదిరా. ఎంతకొట్టినా వెనక్కిపోలేదు. బర్రెదూడని పొడుస్తుందో ఏమో! ఒకపాలి లేచి ఇట్లా రా! దాన్ని బయటికి వెళ్ల తరుము" అని అరచింది లక్ష్మమ్మ.

మొలగుడ్డ బిగించుకొంటూ రమణయ్య దొడ్లోకి పోయాడు.

"ఇదేమి అలవాటమ్మా? పశువుల్ని ఇంటికాడ భద్రంచేసుకోవాలిగాని, ఇట్లా ఊరిమీదికి విడిచిపెట్టితే ఎట్లా అనుకొన్నారో! దొడ్లో నీళ్లకుండలూ బొచ్చెలూ ఉండయి. ఏం నాశనం చేసిందో ఈ ఎద్దు" అని సణుగు

కొంటూ వీథిలోకి వచ్చి, వంగి, వీథి వాకిలి చిమ్మడం మొదలుపెట్టింది లక్ష్మమ్మ.

రమణయ్య ఎద్దును వెతుక్కొంటూ దొడ్లోకి పోయేవరకు అది అప్పటికే చప్పారంలోకి పోయి దున్న పోతుజతను గుంజకాడ నిలిచింది. ఆ యెద్దును జూచి బెదురుకొన్నాయో ఏమో, పండుకొన్న దున్నపోతూ, బర్రెపడ్డా, దూడా ఒక్కసారిగాలేచి నిలబడి ఎద్దువైపు చూస్తున్నాయి.

"దా! దా!" అంటూ, చేతిలో చిన్నకర్ర తీసుకొని ఎద్దును సమీపించాడు రమణయ్య. అతన్ని చూడగానే ఎద్దు ముందుకు రెండడుగులు వేసి మెడకింద గీరమని మోర ఎత్తింది.

అప్పటి కప్పుడే తూర్పురేఖలు బాగాఆరి వెలుగు వచ్చింది. రమణయ్య ఆర్చేట్టే ఎద్దువైపు చూశాడు. దానిచుట్టూ ఒకసారి తిరిగాడు. దగ్గరగా వచ్చాడు. ఎద్దుమోరమీద చెయ్యిపెట్టాడు. పాతనెత్తురూ పాత నెత్తురూ గుర్తు తెలుసుకొన్నాయి.

"అమ్మా! అమ్మా! వెంకన్నవచ్చాడేవు; వెంకన్నేవు" అని పెద్దంగా అరచాడు రమణయ్య.

"ఆ! ఆ! నా వెంకన్నే — నా తిరపతి వెంకటేశ్వర్లే!" అని అరుచుకొంటూ దొడ్లోకి ఒక్కదూకు దూకింది లక్ష్మమ్మ.

అప్పటికప్పుడే తన ఇద్దరు బిడ్డలూ, ఒకరినొకరు పరామర్శించుకొంటున్నారు.

"తప్పించుకొని వచ్చింది కాబోలురా, నాయనా! చూశావా దాని విశ్వాసం! దాన్ని పరాయివాడిచేతిలో పెట్టి ఏడోనెల జొరబడింది. అయితేనేం? దాని కెంతసుర్తో కనుక్కో! ఏవూరునుంచి వచ్చిందో. ఎప్పుడు బయల్దేరిందో" అని అంటూ లక్ష్మమ్మకూడా ఎద్దు దగ్గరగా వచ్చింది.

"నా వెంకన్నా! ఎల్లా అయిపోయావురా! బక్కచేసులడి వరుగైనావు!" అని కంట తడిపెట్టుకొని లక్ష్మమ్మ "వెంకన్నా! మరిచిపోయావను కొన్నాం. ఇంతకాలం ఏడ ఉండావు నాయనా? నీ అన్న రమణడూ, నేనూ నీకు గుర్తుఉండామా?— నీకోసరం అలవటించి మరీ ప్రాణం విడిచాడు — ఆ ముసలాయన. నీచూపు ఆయనకి ఋణం లేకుండా పోయింది. ఈపొద్దు నిన్నుచూచి ఉంటే ఆ మారాజు ఎంత పొంగిపోయేవాడో—"

రమణయ్యా, వెంకన్నా కన్నులరమోడ్చి తన్మయులై ఒకరిలో ఒకరు లీనమై పోయారు.

"అయ్యో! నా బంగారుకొండా! కళ్లల్లోవున్నై ప్రాణాలు! గుర్తుపట్టడానికి శక్యం కాకుండా ఇట్లా ఎండిపోయావేమి—వెంకన్నా? తలుపు తెరిచి చూస్తును గదా—ఎవరిఎద్దో అని భ్రమపడ్డాను. నా తిరపతి వెంకన్నా! మన ఇల్లు విడిచిపెట్టి పోయాక దిగులుపడ్డావా ఏంది? నాకళ్లుకాలిపోతే ఇట్టా శల్యమై పోయావేమి నాయనా!" అని చేత్తో నిమిరింది లక్ష్మమ్మ.

ఎద్దుమొఖంలో మొఖంపెట్టుకొని నిలబడే ఉన్నాడు రమణయ్య.

"నిన్ను చేతులారా ఆపడమటివాళ్లకి అమ్మకొని పాపం ఒడిగట్టుకొన్నాం. ఈ యేడు నెలలూ ఎంత దిగులుపడ్డావో! మేతా నీళ్లూ అమరక ఎట్టా అయిపోయావో! ఏవూరునుంచి వచ్చావు వెంకన్నా? ఇన్నాళ్లు ఎవరింటికాడ ఉండావు నాయనా" అని ఎన్నెన్ని ప్రశ్నలో అడుగుతోంది లక్ష్మమ్మ.

ఇంతలో వీథిలో ఇద్దరు పరాయిమొగవాళ్లు ఎవరో వచ్చి లక్ష్మమ్మని పిలిచారు. ఆమె దొడ్లో ఉన్నదని తెలిసి ఆయిద్దరు మనుష్యులూ దొడ్లోకి వచ్చారు.

"మేం మాదిగలం. మాది సీకాయకొల్లు. ఈ ఎద్దుని మేం మొన్నటిదినం కోటపాడులో యానాది రెడ్డి దగ్గర రెండువరాలకి కొన్నాం"—

"మీరు మాదిగవాళ్లా? అయ్యో, నా వెంకన్న కేం గతిపట్టిందే—" అని లక్ష్మమ్మ గొల్లుమనింది.

"మీదగ్గరకొన్న పడమటి బేరగాళ్లీయెద్దుని కోటపాడులో ఏభయి అయిదు రూపాయలకి యానాదిరెడ్డికి అమ్మివేసిపోయారంట! కాని ఆరెడ్డికాడికి పోయి నేళ్ల

నుంచీ ఎంత మేపినా ఈ ఎద్దు ఎక్కిరాక ఆరోజు కారోజు చిక్కి ఎండిపోతూవచ్చిందంట! దానితో తెగులట్టుకొని పీనుగయిందంట. దీని కారెడ్డి ఎన్నెన్నిమందులో మాకులో పెట్టి వైద్యాలు చేయించి చేయించి కార్యంలేక ప్రాణం విసిగి దీనితో చరపసలేక మొన్నటి రోజున దీన్ని మాకు రెండువరాల కమ్మివేశాడు. దీన్ని తీరా మేను తోలుకొని ఇంటికి పోతూవుంటే, నిన్న రాత్రివేళ ఇది మమ్మల్ని తప్పించుకొని పారిపోయింది. ఇది మీవూరి ఎద్దని మాకు తెలుసు. అందువల్ల ఈడకే పోయి ఉంటదని మే మిద్దరం అపరాత్రికాడ లేచి వెతుక్కుంటూ వచ్చాం. చూడండి. ఆఎద్దు కున్నన్ని మరులు మానవుడికి ఉంటాయా ?" అని మాదిగలిద్దరూ ఎద్దువృత్తాంతం అంతా చెప్పారు.

ఈవిషయం అంతా చెవుల్లో వేసుకొంటూ ఉండిన రమణయ్యా, లక్ష్మమ్మా కొయ్యబారిపోయారు.

వెంకన్న శిరస్సు రమణయ్య బాహువల్లర్లలోనే చిక్కుకొనివుంది. రమణయ్య కన్నీటిధార కాలువలు కట్టుతోంది. లక్ష్మమ్మ తేపతేపకూ ముక్కు తుడుచుకొంటూ ఎద్దుదగ్గిరనే నిలబడింది. గెడ్డంకింద కర్రలు మోటించి, మాదిగ లిద్దరూ చూస్తూ నిలబడ్డారు.

గుంటలుకట్టిన నేత్రాలు రెండూ ఒక్కసారిగా, నల్లగుడ్డు మరుగుపడేటట్టుగా గిర్రున తిప్పాడు వెంకన్న. రమణయ్య తన రెండుకళ్లూ తిప్పి ఎద్దుకళ్లల్లోకి చూశాడు. నిలబడిన ఆయెద్దు ముందుకాళ్లు రెండూ ముడిచి కిందికి మోకరించింది. దాని మెడ విడవకుండానే రమణయ్యకూడా మోకరిల్లాడు. ఎద్దు నందివాహనం లాగా పండుకొన్నది. ఎద్దుతల తనఒడిలో పెట్టుకొని కూర్చున్నాడు రమణయ్య. ఎద్దు కళ్లు రెండూ మూసేసింది.